అధికారులు హాజరుకాకుంటే సమస్యలు తీర్చేదెవరు..?

- ఎంపీపీ సుంకర సునీత ఆగ్రహం
- మండల పరిషత్ సమావేశానికి ఎనిమిది శాఖల అధికారులు గైర్హాజరుపై మండిపాటు
- నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించిన ఎంపీడీవో


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుంకర సునీత

ముండ్లమూరు (దర్శి): అధికారులు హాజరు కాకపోతే ప్రజా ప్రతినిధులు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ముండ్లమూరు ఎంపీపీ సుంకర సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ గత సమావేశాలలో ప్రస్తావించిన పనులు, సమస్యలపై మళ్లీ వచ్చే సమావేశాలలో ప్రస్తావన లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. ఇక్కడ ప్రశ్నిస్తారనో.. లేక ఇతర కారణాలు చూపి అధికారులు ప్రతి మూడు నెలలకు జరిగే సర్వసభ్య సమావేశాలకు రాకపోతే వచ్చిన ప్రజాప్రతినిధులు ఆ శాఖలకు చెందిన సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధికి తీర్మానాలు చేసి వాటిని అమలు చేయాలని, ఆమోదం ఎందుకు చేయలేదని సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, ఎంపీటీసీలు ప్రశ్నించారు. ఎంపీడీవో ఎం.శ్రీదేవి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశానికి ఎన్ని శాఖల అధికారులు హాజరయ్యారని అడిగి తెలుసుకున్నారు. 8 శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో ఆ శాఖల అధికారులకు నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు రాకపోవడం దురదృష్టకరమన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చట్టాన్ని అతిక్రమిస్తే షాపు లైసెన్స్ రద్దు


హనుమాన్ జంక్షన్‌కుంటలో విత్తనాల షాపును తనిఖీలు చేస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ

పెద్దారవీడు: చట్టాన్ని అతిక్రమిస్తే విత్తనాల షాపుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని వ్యవసాయాధికారి ఎస్ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. మండలంలో హనుమాన్ జంక్షన్ కుంటలో మూడు విత్తనాల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల డీలర్లు చట్టాలకు లోబడి వ్యాపారం చేసుకోవాలని, అలా కాకుండా అతిక్రమిస్తే సంబంధిత లైసెన్స్ రద్దు చేసేందుకు సిఫార్సు చేస్తామన్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకొని విత్తనాలను అధిక ధరలకు అమ్మరాదని, రైతు కొనుగోలు చేసిన విత్తనాల ప్యాకెట్‌కు తప్పనిసరిగా డీలర్లు రశీదు ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, కంపెనీ అనుమతి పత్రాలు పరిశీలించారు. విత్తనాల నమూనాలను తీసి పరీక్షల నిమిత్తం పంపుతామన్నారు. ఆయన వెంట ఏఈఓ సునీల్‌నాయక్, డీలర్లు ఉన్నారు.

పంటల బీమాపై రైతులకు అవగాహన అవసరం


ఆరవల్లిపాడులో పంటల బీమా గురించి తెలియజేస్తున్న ఏఓ

దొనకొండ: మండలంలోని ఆరవల్లిపాడు, తెల్లబాడు గ్రామాల్లోని రైతులకు మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణనాయక్ పంటల బీమాపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వివిధ పంటలకు చెల్లించాల్సిన బీమా ప్రీమియం, గడువు తేదీ గురించి వివరించారు. పత్తి పంటకు ఎకరాకు రూ.2,100 చొప్పున జూలై 15వ తేదీలోపు బీమా చెల్లించుకోవాలన్నారు. కంది పంటకు ఎకరాకు రూ.430 చొప్పున జూలై 31వ తేదీలోపు కట్టుకోవాలన్నారు. ఎండు మిర్చికి ఎకరాకు రూ.4,500 చొప్పున జూలై 31వ తేదీలోపు చెల్లించాలన్నారు. పంటలకు బీమా కట్టుకోవడం వలన ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టం వాటిల్లితే ప్రభుత్వం వారి పంటల బీమా ద్వారా రైతులకు నష్టపరిహారం అందజేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కోరారు.

అభ్యసన సామర్థ్యాలను పెంచేలా కృషి చేయాలి

పుల్లలచెరువు: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యలను పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవోలు ఎండీ ఖాసిం, ఇందిర పేర్కొన్నారు. మండలంలోని ఐటీ వరం పాఠశాలను శుక్రవారం ఎంఈవోలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టీని, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యలను పరిశీలించి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థులు సమయపాలన పాటించాలని అన్నారు. తరగతులకు తగిన విధంగా విద్యార్థుల సామర్థ్యలను పెంచేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులందరూ యూనిఫాం వేసుకుని వచ్చేలా చూడాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. ప్రభుత్వ నియమాలను అనుసరించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

వైభవంగా సాయినాథుని రథోత్సవం

మార్కాపురం టౌన్: పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయినాథుని రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పురవీధుల్లో మేళతాళాలు, భక్తి గీతాలు, కోలాట ప్రదర్శన నడుమ వైభవంగా సాగిన రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మందిర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గోపాలుని హరిహరరావు, పేరంసత్యనారాయణ, ట్రెజరర్ నాగరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

15న మండల పరిషత్ సమావేశం

కొనకనమిట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించనున్న నేపథ్యంలో పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలలని సూచించారు. వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

బూత్ లెవల్ అధికారులకు శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి సత్యనారాయణ

పెద్దదోర్నాల: మండల పరిధిలోని బూత్ అధికారులకు, సూపర్‌వైజర్లకు ఒక్క రోజు శిక్షణ తరగతులను శుక్రవారం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అధికారి సత్యనారాయణ పాల్గొన్న ఈ శిక్షణ తరగతుల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు ఆర్‌పీ యాక్ట్, 1950 సెక్షన్లు, బూత్ లెవల్ ఏజంట్లు, బూత్ లెవల్ అవేర్నెస్ గ్రూప్‌ల గురించి వివరించటంతో పాటు, బ్లో యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా బూత్ లెవల్ అధికారులకు పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎలక్షన్ సీనియర్ సహాయకులు శివప్రసాద్, మాస్టర్ ట్రైనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలలో పాల్గొన్న బూచేపల్లి


స్వామివారి విగ్రహంతో ప్రదక్షిణలు చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: స్థానిక పొదిలి రోడ్డులోని శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. స్వామివారి పల్లకి సేవలో పాల్గొని స్వామి వారిని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తూ మోశారు. అనంతరం ఆలయం పురోహితులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాసరావు

దర్శి: మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని ఎక్సైజ్ సీఐ కే శ్రీనివాసరావు సూచించారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండేందుకు వాటి వలన కలిగే అనర్థాలపై మండలంలోని రాజంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉండాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ వాడకం శారీరకంగా, మానసికంగా, సామాజికంగా తీవ్రమైన ప్రభావాలు చూపుతుందని తెలిపారు. మత్తు పదార్థాలలోని రకాలు, అవి ఏ విధంగా మానవ నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తాయనే విషయాలను వివరించారు. మాదక ద్రవ్యాలు కలిగి ఉండటం, వినియోగం, రవాణా, విక్రయం అనేది శిక్షార్హమైన నేరమని స్పష్టం చేశారు. డ్రగ్స్ వాడకాన్ని నివారించడంలో కుటుంబం, విద్యాసంస్థలు, సమాజం కలిసికట్టుగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో అవగాహన కలిగించేందుకు పోస్టర్లు, బ్రోచర్లు, వీడియోల ద్వారా ప్రచారం నిర్వహించారు. మత్తుపదార్థాల బారిన పడిన ఒక విద్యార్థి జీవితంపై షార్ట్ వీడియో ప్రదర్శించగా, విద్యార్థులను ఆకట్టుకుంది. భవిష్యత్తులో మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా ఉంటామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకుడు చెంచయ్య, దర్శి ఎక్సైజ్ ఎస్సై రఘుసత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు నెల పొంగళ్లు


అమ్మవారికి పొంగళ్లు సమర్పిస్తున్న మహిళలు


పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి


ప్రత్యేక అలంకరణలో నాంచారమ్మ తల్లి బొడ్డురాయి

తాళ్లూరు: మండలంలోని వెలుగువారిపాలెం గ్రామంలో పోలేరమ్మ, నాంచారమ్మ తల్లికి నెల పొంగళ్ల కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచే మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామ ప్రజలు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

పోలేరమ్మకు చీర, సారె సమర్పణ

దొనకొండ: ఆషాఢ బహుళ పాడ్యమి శుక్రవారాన్ని పురస్కరించుకుని పోలేరమ్మకు చీర, సారె కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ ఆనంద ఆశ్రమం ఉత్తర ద్వారం పక్కన వెలసిన శ్రీ పోలేరమ్మ తల్లికి ఉదయం 8 గంటల నుంచి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. కుంకుమ పూజలు, అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొని పోలేరమ్మకు చీర, సారె సమర్పించారు. అమ్మవారికి పులిహోర, పొంగళ్లు సమర్పించి సామూహిక హారతులిచ్చారు. భక్తులకు భైరవానందస్వామి తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం చేశారు.

మతిస్థిమితం లేక తప్పిపోయిన వ్యక్తి


దుగ్గెంపుడి రమణారెడ్డి (ఫైల్)

పెద్దారవీడు: మండలంలోని బోడిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దుగ్గెంపూడి రమణారెడ్డి కనిపించడంలేదని కుటుంబ సభ్యులు పెద్దారవీడు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన ప్రకారం రమణారెడ్డి (54) ఈ నెల 6వ తేదీ రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని, అతనికి మతిస్థిమితం సరిగా లేదన్నారు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ దొరకలేదని తెలిపారు. ఎవరికైనా రమణారెడ్డి ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్ఐ అనిల్‌కుమార్ సెల్: 9121102186, పోలీస్ స్టేషన్ సెల్:9154880819, యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్ సెల్: 9121102192 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలో ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్‌లో భాగంగా నూతన విద్యుత్ లైన్లు వేస్తున్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

మార్కాపురం: పెద్దారవీడు, మార్కాపురం మండలాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని మార్కాపురం రూరల్ విద్యుత్ ఏఈ నాగేంద్రరెడ్డి తెలిపారు. మార్కాపురం మండలంలోని కోమటికుంట, తిప్పాయిపాలెం, బొడిచర్ల, గజ్జలకొండ, రాయవరం, పెద్దారవీడు మండలంలోని పెద్దారవీడు, పుచ్చకాయలపల్లి, తోకపల్లి, చట్లమిట్ల సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వివరించారు.

పొలాల్లోనే ఈ క్రాప్ నమోదు

బేస్తవారిపేట: పొలం వద్దకు వెళ్లి ఈ-పంట నమోదు చేయాలని వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి తహసీల్దార్ జితేంద్రకుమార్ సూచించారు. స్థానిక ఏఓ కార్యాలయంలో వీఆర్వోలు, వీఏఏలకు ఈ-క్రాప్ బుకింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇష్టారాజ్యంగా ఈ-క్రాప్ నమోదు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీఆర్‌సీ కార్డు కలిగిన రైతుల పేరుమీదనే ఈ-పంట నమోదు చేయాలని స్పష్టం చేశారు. వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ.. పంట వేయని బీడు భూములను, ఐదేళ్లుగా సాగు చేయని భూములు, ప్రస్తుతం సాగు చేయని భూములను నమోదు చేయాల్సి ఉందన్నారు.

బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ


సమావేశం ఏర్పాట్లపై పార్టీ నాయకులకు సూచనలిస్తున్న అన్నా రాంబాబు

- నేడు మార్కాపురంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం
- ఏర్పాట్లను పరిశీలించిన అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని బి-కన్వెన్షన్ హాల్లో శనివారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం, బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పి.చెంచిరెడ్డి తెలిపారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి విభాగాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు. కాగా, విస్తృత స్థాయి సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి అన్నా రాంబాబు పరిశీలించారు. కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి పత్తి రవిచంద్ర, తర్లుపాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ సలీమ్, బొగ్గరపు శేషయ్య తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారుల భద్రత ముఖ్యం

రాచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల రాకపోకలు, భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ వారణాసి గిరిధరశర్మ పేర్కొన్నారు. మండలంలోని అనుమలవీడు, పాలకవీడు, యడవల్లి, సోమిదేవిపల్లె గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యామిత్ర కిట్లు పంపిణీ చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సూచనలు సలహాలిచ్చారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

తర్లుపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది. తర్లుపాడు మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా డి.రమేష్‌రెడ్డి, మహిళా విభాగానికి వై.సరస్వతి, రైతు విభాగానికి ఆర్.అంకయ్య, బీసీ సెల్‌కు ఎం.అంజయ్య, ఎస్సీ సెల్‌కు శాంతారావు, ఎస్టీ సెల్‌కు ఎస్.నాగరాజు, మైనార్టీ సెల్‌కు షేక్ మహబూబ్ సుబానీ, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు ఎం.బర్నబాస్, స్టూడెంట్ వింగ్‌కు కె.శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్‌కు స్వరూపారాణి, ఆర్‌టీఐ వింగ్‌కు మంద శివారెడ్డి, వలంటీర్స్ వింగ్‌కు సీహెచ్ శివారెడ్డి, వాణిజ్య విభాగం పి.వెంకటేశ్వర్లు, వీవర్స్ వింగ్ ఎల్ శ్రీను, వైఎస్సార్ టీయూసీకి ఎం.చిన్నమల్లికార్జున్, అంగన్‌వాడీ వింగ్‌కు జి.నవ్య, కల్చరల్ వింగ్‌కు బి.కాశయ్య, సోషల్‌మీడియా వింగ్‌కు తారక్‌సాయి, దివ్యాంగుల విభాగానికి బి.వెంకటేశ్వర్లు, పబ్లిసిటీ వింగ్‌కు ఆర్.శ్రీను నియమితులయ్యారు.

కొనకనమిట్ల మండలంలో

కొనకనమిట్ల మండల యూత్ వింగ్ అధ్యక్షుడిగా గాడి కోనేటిరెడ్డి, మహిళా విభాగానికి టి.హసీనా, రైతు విభాగానికి పి.అంజిరెడ్డి, బీసీ సెల్‌కు పాలూరి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్‌కు మంచికల కోటేశ్వరరావు, ఎస్టీ సెల్‌కు పాట్లూరి ఓనమాలు, మైనార్టీ సెల్‌కు పార్లపల్లి నభి, క్రిష్టియన్ మైనార్టి సెల్‌కు బూదాల చినసుబ్బయ్య, స్టూడెంట్ వింగ్‌కు తంగిరాల బ్రహ్మారెడ్డి, పంచాయతీరాజ్ వింగ్‌కు బేతా ప్రకాష్‌రెడ్డి, ఆర్టీఐ వింగ్‌కు టి.నాగార్జునరెడ్డి, వలంటీర్ల వింగ్‌కు మారావతు వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగానికి గోనుగుంట్ల శ్రీనివాసులు, చేనేత విభాగానికి కోండ్రు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌టీయూసీకి వేమన వెంకటేశ్వరరెడ్డి, కల్చరల్ వింగ్‌కు బోయిన వెంకటేశ్వర్లు, సోషల్ మీడియా విభాగానికి కోటపాటి బ్రహ్మారెడ్డి, దివ్యాంగుల విభాగానికి గొంగటి కరుణయ్య, పబ్లిసిటీ విభాగానికి ముక్కాల శేఖరరెడ్డిని నియమించారు.

ఆర్టీసీ ఉద్యోగుల పక్షాన ఎంప్లాయీస్ యూనియన్


మాట్లాడుతున్న శాస్త్రి

మార్కాపురం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ కృషి చేస్తోందని జోనల్ సహాయ కార్యదర్శి సోమయాజుల శాస్త్రి పేర్కొన్నారు. శుక్రవారం ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని డిపో వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల మంది డ్రైవర్లు, కండక్టర్లను ప్రభుత్వం వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. డిపోలో అక్రమ సస్పెన్షన్లను నివారించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాయుడు, వెంకటేశ్వర్లు, నాని, రెహమత్, చిన్న బాషా, అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

తుప్పు పట్టిన తాగునీటి పైపులు మార్చాలి


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ రమణబాబు

గిద్దలూరు రూరల్: మంచినీరు సరఫరా చేస్తున్న పైపులు తుప్పుపట్టి నీరు కలుషితమవుతోందని గిద్దలూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి మెట్ల వీధికి చెందిన పలువురు కమిషనర్ ఈవీ రమణబాబు దృష్టికి తీసుకెళ్లారు. చాలా కాలం క్రితం వేసిన పైపులు కావడంతో తుప్పుపట్టాయని, వాటిని మార్చి కొత్తవి వేయాలని కోరారు. శుక్రవారం స్థానిక రాజానగర్, శ్రీలక్ష్మీనరసింహస్వామి మెట్ల వీధిలో కమిషనర్ పర్యటించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి, ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.

గ్యాస్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలి

మార్కాపురం టౌన్: గ్యాస్ వినియోగదారులు అప్రమత్తంగా లేకపోతే సిలిండర్ పేలి అగ్నిప్రమాదాలు సంభవిస్తాయని పీఎల్పీ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్, వైఎస్సార్ సీపీ నాయకుడు పీఎల్పీ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో సేఫ్టీ క్లినిక్‌లో భాగంగా గ్యాస్ వాడకంపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్యాస్ పైప్‌పై ఎక్స్‌పైయిరీ డేట్‌ను గమనించాలని సూచించారు. గ్యాస్ స్టవ్, సిలిండర్ నుంచి వాసన వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. వంట పూర్తి కాగానే గ్యాస్ రెగ్యులేటర్ ఆపాలని స్పష్టం చేశారు. మెటల్ సిలిండర్ల స్థానంలో ప్లాస్టిక్‌వి వస్తున్నాయని, వీటి వల్ల సిలిండర్లు పేలే ప్రమాదం ఉండదని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీదేవి, పీడీ జాహ్నవి ప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న పీఎల్పీ యాదవ్